క్లుప్తంగా

ఇంటి పన్నులు వసూలు చేయాలి



ఇంటి పన్నుల వసూళ్లను పర్యవేక్షిస్తున్న ఎంపీఓ రవీంద్ర ప్రసాద్

చింతకాని: ఇంటి పన్నులు వంద శాతం వసూలు చేయాలని మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్ర ప్రసాద్ తెలిపారు. మండలంలోని నాగిలిగొండ గ్రామంలో ఆదివారం ఇంటి పన్నుల వసూళ్ల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది వంద శాతం ఇంటి పన్నుల వసూళ్లకు కృషి చేయాలని తెలిపారు. ఇంటి పన్నుల వసూళ్లపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సురేష్, గ్రామ పంచాయితీ కార్యదర్శి అనీల్ కుమార్, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే వేతనాల పెంపు

సత్తుపల్లిరూరల్: ఏఐటీయూసీ చేసిన దశల వారి, సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ప్రభుత్వం జీఓ నంబర్ 8 విడుదల చేసిందని (ఏఐటీయూసీ) మధ్యాహ్న భోజన రాష్ట్ర కమిటీ సభ్యుడు నిమ్మటూరి రామకృష్ణ తెలిపారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రిని కలిసి వినతిపత్రం ఇవ్వడం, కమిషనర్ ఆఫీస్ ముట్టడి లాంటి అనేక పోరాటాలు చేసిందని తెలిపారు. ఏరియర్స్ కూడా చెల్లించాలని, భవిష్యత్‌లో కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ పోరాటాలు చేస్తుందన్నారు.

రావూరిని పరామర్శించిన ఎంపీ నామ



మధిర: ఇటీవల వెన్నుముకకు శస్త్ర చికిత్స చేయించుకున్న బీఆర్ఎస్ మధిర మండల అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావును మధిర పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా కోలుకునే వరకు విశ్రాంతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ వెంట జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కనుమూరి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, నరేందర్ రెడ్డి, అప్పారావు తదితరులు ఉన్నారు.

పంటలకు మద్దతు ధర చట్టం చేయాలి



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకుడు ఖాసీం

కొణిజర్ల: పంటలు అమ్ముకోవడానికి కనీస మద్దతు ధర చట్టం చేయాలని సీపీఐఎం ఎంఎల్ న్యూడెమోక్రసీ అనుబంధ అఖిత భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు షేక్ ఖాసీం అన్నారు. మండలంలోని తీగలబంజరలో ఆదివారం సంఘం మండల సమావేశం మండలాధ్యక్షుడు గంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పఠాన్ ఖాసీమ్ ఖాన్, సీతయ్య, బాబు, నాగులుమీరా, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

సత్తుపల్లిటౌన్: ఎన్టీఆర్‌నగర్ క్రీస్తు సంఘం ప్రార్థనా మందిరంలో సంఘం సభ్యులైన ఎం.నాగరాజు, జ్యోతి, కె.బాలస్వామి, సబిత దంపతుల ఆర్థిక సాయంతో స్థానిక సువార్తికులు, ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ చేతుల మీదుగా 50 మంది వృద్ధులకు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనీల్‌కుమార్, ప్రకాశరావు, భాస్కర్ రావు, శాంతిభూషణ్, ప్రభాకర్, కాంతారావు, పి.నవకుమార్, ఐ.నాగేశ్వరరావు, పి.కుమార్, జార్జీ, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశం విజయవంతం చేయాలి

ఎర్రుపాలెం: బోనకల్ మండలంలో ఈ నెల 6న నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్‌ల ముఖ్య నాయకుల సన్నాహక సమావేశానికి నియోజకవర్గం కార్యకర్తలందరూ తరలిరావాలని నియోజకవర్గ ఇన్‌చార్జీ కూరపాటి ప్రభాకర్‌మాదిగ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 13న హైద్రాబాద్–విజయవాడ హైవే రోడ్డు దిగ్బంధన కార్యక్రమం మందా కృష్ణమాదిగ ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమం విజయవంతం కోరుతూ ఈ సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు మేకల రమేష్ మాదిగ, ఆదూరి రమేష్, శ్రీనివాసరావు తదితరులున్నారు.

అడగండి అది మన హక్కు!

పెట్రోల్‌బంకుల్లో కనిపించని ఉచిత వసతులు..

- స్వచ్ఛమైన నీరులేదు.. ఉచిత గాలిలేదు..
- అధికారుల పర్యవేక్షణ కరువు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ ధరలు మోతమోగిస్తుంటే, మరోపక్క ప్రతీ లీటర్‌పై వ్యాట్ రూపంలో చెల్లించే రుసుంతో బంకుల్లో వినియోగదారులకు కల్పించాల్సిన సౌకర్యాల గురించి చాలా మందికి తెలియదు. బంకుల వద్ద వినియోగదారులకు కచ్చితమైన సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. గాలి, నీరు పలు సదుపాయాలు ఏ పెట్రోల్ బంకుల్లోనైనా అందించకపోతే మీరే స్వయంగా ఫిర్యాదు చేయొచ్చు.



ముదిగొండలో ఓ పెట్రోల్ బంకు

ముదిగొండ: మండలంలో వల్లబిలో, బాణాపురంలో, వనంవారికిష్టాపురంలో, ముదిగొండలాల్లో రెండు వివిధ రకాల కంపెనీల పెట్రోల్, డీజిల్ బంకులున్నాయి. వాటిల్లో కనీస వసతి సౌకర్యాలు లేక వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్యలు ఉత్పన్నమౌతున్నా.. రెవెన్యూ, సివిల్ సప్లై, తూనికలు, కొలతలు అధికారుల పర్యవేక్షణ లేదని ఆరోపణలొస్తున్నాయి. నూతనంగా ఏర్పాటు చేసిన బంకుల్లో కూడా టైర్లల్లో గాలి నింపేందుకు మనిషి లేదని దాటవేస్తున్నారే తప్ప గాలి మాత్రం నింపకపోవడం గమనార్హం. ఇక మంచి నీటి వసతి దేవుడెరుగు. ప్రశ్నిస్తే సమాధానం చెప్పే నాధుడే కరువైంది. ఆయా పెట్రోల్ బంకుల్లో ఏ రోజు గాలి మిషన్ వద్ద ప్రత్యేకించి మనిషి కనిపించడం లేదని, గాలి మిషన్ పని చేయడం లేదని వాపోతున్నారు. ప్రతి పెట్రోల్ బంకులో జిల్లా అధికారులు పర్యవేక్షించి, కనీస సౌకర్యాలు కల్పించాలని వినియోగదారులు, ప్రజలు కోరుతున్నారు.

బంకుల్లో ఈ సేవలు ఉచితంగా ఉండాలి..

- బంకుల వద్ద స్వచ్ఛమైన తాగునీరు ఉండాలి. ఇందు కోసం బంకు డీలర్ ఆర్వో యంత్రం, వాటర్ కనెక్షన్ స్వయంగా పొందాల్సి ఉంది. ఏ బంకులో కూడా తాగునీటి వసతి సౌకర్యం లేకపోతే ఆయిల్ కార్పొరేషన్‌కి ఫిర్యాదు చేయొచ్చు.
- స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా అన్ని బంకుల్లో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం శుభ్రతతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. పలు పెట్రోల్ బంకుల్లో ఏర్పాటు చేసినా వినియోగించేందుకు నిర్వాహకులు అనుమతులివ్వడం లేదు. మరికొన్ని చోట్ల అసలు కనింపించని పరిస్థితి నెలకొంది. బంకుల్లో ఇలాంటి సౌకర్యాలు లేనట్లయితే, పెట్రోలియం సస్థలకు పిర్యాదు చేయ్యొచ్చు. బంకుల్లో లీటరు పెట్రోలు, లేదా డీజిల్ కొనుగోలు చేస్తే 10పైసలు వరకు మరుగుదొడ్లకు, మూత్రశాలలకు నిర్వాహకులకు చెల్లిస్తున్నాం.
- ఆపద సమయంలో అత్యవసర పరిస్థితుల్లో ఫోన్‌ను వినియోగించుకునే సదుపాయం బంకుల్లో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యలో చిక్కుకుంటే మీ వెంట మీ మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పనిలేదు. ఏదైనా పెట్రోల్ బంక్‌ను సందర్శించినప్పుడు, మీరు ఏ నంబర్‌కైనా కాల్ చేయవచ్చు.
- వాహనాలల్లోని టైర్లల్లో గాలి నింపడానికి అనువుగా బంకుల్లో యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. ఇటీవల కాలంలో టైర్లల్లో గాలి నింపడానికి ఒక్కో టైరుకు బయట షాపుల్లో రూ.10లు తీసుకుంటున్నారు. బంకుల్లో గాలి నింపడానికి ఒక వ్యక్తిని అందుబాటులో ఉంచాలి. బంకుల్లో పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయకున్నా, వాహనదారులు కోరితే టైర్లల్లో గాలి తనిఖీ చేయాలి. ఎక్కువ శాతం ట్యూబ్‌లెస్ టైర్లు రావడంతో ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు. వాటిలో నైట్రోజన్ నింపాలి.



వనంవారికిష్టాపురంలో పని చేయని గాలి, మంచినీటి యంత్రాలు

- ప్రతీ బంకులో ఫిర్యాదు పెట్టి, లేదా రిజిజ్టర్‌ను అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారుడు తమ ఫిర్యాదులను నమోదు చేయొచ్చు. ప్రథమ చికిత్స కిట్టు ప్రతి బంకులో ఉండాలి. దీంతో పాటు అన్ని మందులపై గడువు తేదీ రాసి ఉండాలి. పాత మందులు ఉండకూడదు.
- పెట్రోల్, డీజిల్ నాణ్యత ప్రమాణాలను తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంటుంది. ప్రతి ఒక్కరు ఇవన్నీ తెలుసుకోవచ్చు. ఇవన్నీ తెలుసుకోవడానికి పరికరాలు ఇద్దంగా ఉంచాలి. వాటి ద్వార నాణ్యతను పరీక్షించేందుకు హక్కు మనకు ఉంటుంది. పెట్రోల్, డీజిల్ తక్కువ వస్తే ఆ పరీక్ష కిట్ల ద్వారా తెలుసుకోవచ్చు.

సౌకర్యాలు కల్పించాలి..



పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి, ఎక్కడ పెట్రోల్ బంకుల్లోకి వెళ్లినా గాలి మిషన్ పని చేయడం లేదని చెపుతున్నారే తప్ప మళ్లి దానిని రిపేరు చేయించడం లేదు. ఫిర్యాదుల పెట్టె కూడా కనిపించకుండా చేస్తున్నారు. కొన్ని గాలి మిషన్‌ల వద్ద గాలి నించే మనిషి లేకపోవడంతో బయట టైర్లల్లో గాలి డబ్బులు పెట్టి నింపిస్తున్నాం.

– మరికంటి శ్రీనివాస్, బాణాపురం

పట్టించుకోవడం లేదు..



పెట్రోల్, డీజిల్ బంకుల్లో సమస్యలపై ఏ అధికారి కూడా పర్యవేక్షించిన దాఖలాలు లేవు. రాత్రి వేళల్లో వస్తే లైట్లు లేకుండా, బంకు మూసి వేసి ఉంటుంది. గాలి నింపించుకుందామంటే గాలి మిషన్ పని చేయదు. కనీసం మంచినీటి సౌకర్యం కూడా కల్పించడం లేదు. ప్రతి నెల పెట్రోలు బంకులను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలి.

– వట్టే సురేష్, వనంవారికిష్టాపురం

అమ్మవారి దయ.. మీ ఆశీర్వాదం ఉండాలి



శ్రీతిరుపతమ్మతల్లి – గోపయ్యస్వామి కల్యాణ వేడుకలో ఎమ్మెల్యే రాములు నాయక్

కారేపల్లి: తిరుపతమ్మ అమ్మవారి దయ, మీ ఆశీర్వాదం ఉంటే.. రెండోసారి వైరా ఎమ్మెల్యే నేనే అవుతానని వైరా ఎమ్మెలే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. ఆదివారం కారేపల్లిలోని భీక్యా తండా శ్రీతిరుపతమ్మతల్లి ఆలయంలో తిరుపతమ్మ తల్లి – గోపయ్యస్వామి కళ్యాల్యా, తిరుపతమ్మతల్లి మాలాధారుల ఇరుముడి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులతో మేళతాళాల నడుమ ఎమ్మెల్యే రాములు నాయక్ నృత్యం చేస్తు అలరించారు. ఆయన వెంట ఎంపీపీ మాలోతు శకుంతల, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఉమాశంకర్, ఇస్లావత్ బన్సిలాల్, నాయకులు వీరన్న, ఐలయ్య, కిషోర్, నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా ఉండాలి



మాట్లాడుతున్న పారుపల్లి నాగేశ్వరరావు

మధిర: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా ఉండాలని టీఎస్ యూటీఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ డివిజన్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి అధ్యక్షతన యూనియన్ మధిర డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏడు సంవత్సరాల తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు అనుమతి ఇచ్చిందన్నారు. బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తామని చెప్పిన ప్రభుత్వం దొడ్డిదారిన చెక్ స్లిప్ బదిలీలకు తెరలేపడం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అక్రమ బదిలీలను ఆపాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు వినోద్‌రావు, నాగరాజు, వీరయ్య, లక్ష్మణరావు, లాల్ అహ్మద్, ఇబ్రహీం, చెన్నయ్య, కొండలరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు లాల్ మహమ్మద్

వైరారూరల్: కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని ఖమ్మం జిల్లా పరిషత్ కోఆప్షన్‌మెంబర్ షేక్ లాల్ మహమ్మద్ అన్నారు. ఆదివారం వైరా మండలం కొత్త మునలిమడుగు (టీటీడబ్ల్యూఆర్‌జేసీ) గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి సత్ప్రవర్తనతో మెలిగాలని, బాగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షలపై అవగాహన సదస్సు



సత్తుపల్లి టౌన్: విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న హెచ్‌డబ్ల్యూఓ రాములు

సత్తుపల్లి: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక యూనివర్సిటీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు, న్యాక్‌పై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామచంద్రరావు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి పట్టుదలతో పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ శ్రీనివాస్, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ..

సత్తుపల్లిటౌన్: గిరిజన విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సత్తుపల్లి ఎస్టీ బాలుర హాస్టల్ హెచ్‌డబ్ల్యూఓ బి.రాములు అన్నారు. హాస్టల్‌లోని పది విద్యార్థులకు ఆదివారం రాత్రి పరీక్షలకు సంబంధించి ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలు, పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు.

రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం గ్రామంలో ఎన్టీఆర్ కాలనీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రెండు రాష్ట్రాల స్థాయి స్థాయి(ఖమ్మం, ఎన్టీఆర్ జిల్లాలు) కబడ్డీ పోటీలను స్థానిక ఎస్సై ఎం.సురేష్, సర్పంచ్ రామారావు, చర్చి ఫాదర్ సూరేపల్లి ఐజాక్‌లు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రశాంతంగా క్రీడలు నిర్వహించుకోవాలని తెలిపారు. ఏపీ, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన 50 టీమ్‌లు ఈ క్రీడల్లో పాల్గొనేందుకు ముందుకొచ్చాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నర్సిరెడ్డి, హరికృష్ణ, గోపి, సాంబశివరావు, రామకృష్ణ, పీఈటీలు కోనా రమేష్, కుడుముల మల్లిఖార్జున్‌రెడ్డి, గూడూరు సత్యనారాయణరెడ్డి, విజయభాస్కర్ తదితరులున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఎఫ్‌సీసీ జట్టు



క్రికెట్ టోర్నీ విజేత జట్టుతో నిర్వాహకులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఎనిమిది రోజుల పాటు జరిగిన వైఎంసీసీ సీజన్–2 క్రికెట్ టోర్నమెంట్‌లో ఎఫ్‌సీసీ జట్టు ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టీఎల్‌బీ జట్టుపై 70 పరుగుల తేడాతో విజయం సాధించింది. యర్రా మనోజ్ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. పోటీల్లోని విజేతలకు పట్టణ ప్రముఖులు చల్లగుళ్ల నర్సింహారావు, జ్యేష్ట లక్ష్మణ్‌రావు మెమోంటోలు, బహుమతులు అందించారు. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అభి, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్ అవార్డును మహేష్, బెస్ట్ బౌలర్ అవార్డు వెంకి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కన్నెగంటి లోకేష్, అనుమోలు భరత్, కొల్లి శ్రీను, అశోక్‌లు పాల్గొన్నారు.

9న హమాలీల ధర్నా

తల్లాడ: ఈ నెల 9న హైదరాబాద్ లేబర్ కార్యాలయం వద్ద జరగనున్న హమాలీ సంఘం ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం హమాలీ సంఘం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. తల్లాడ మండలం అంజనాపురం రైస్ ఇండస్ట్రీస్ వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం రాష్ట్ర నాయకులు డి.శ్రీనువాసరావు, ఎస్‌కె.లాల్‌మియా, యేసు, ఖాజామియా, సుధాకర్ పాల్గొన్నారు.

ముగిసిన సత్తెమ్మతల్లి తిరునాళ్లు

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



సత్తుపల్లిరూరల్: పూర్ణకుంభంతో ఎమ్మెల్యే సండ్రకు స్వాగతం పలుకుతున్న కమిటీ సభ్యులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారం – చెరుకుపల్లి గ్రామాల మధ్య గల సత్తెమ్మతల్లి ఆలయం వద్ద రెండు రోజులుగా జరుగుతున్న తిరునాళ్ల మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ తిరునాళ్ల మహోత్సవానికి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరు కావటంతో పూర్ణకుంభంతో, మేళతాళాలతో ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం సత్తెమ్మతల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనాదికాలం నుంచి సరిహద్దు గ్రామాల ప్రజలు ఇలవెల్పుగా అమ్మవారిని పూజిస్తూ.. మహోత్సవాలను నిర్వహిస్తూ తమ భక్తిని చాటుతున్నారు. అనంతరం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కె.ధనుంజయ్, కొడిమెల అప్పారావు, రావి నాగేశ్వరరావు, ఉడతనేని అప్పారావు పాల్గొన్నారు.

ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే..

కల్లూరు: కల్లూరులోని శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవాలయం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సమక్షంలో జరిగింది. ఆలయ చైర్మన్‌గా గుర్రం వెంకటేశ్వరరావు (శ్రీను), వైస్ చైర్మన్‌గా బొడ్డు కృష్ణ, సభ్యులుగా ఎనుముల రాంబాబు, మల్లాది బసవయ్య, ఆజ్మీరా జమలయ్య, ఇల్లూరి దుర్గ, డి.అలీవేలు లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ.. ఈ వేణుగోపాలస్వామి దేవాలయానికి ఎంతో ప్రతిష్ఠ ఉందన్నారు. దేవాలయానికి స్వామివారి పేరు మంద 260 ఎకరాల మేరకు పట్టా ఉందన్నారు. ఆలయ కమిటీ సమన్వయంతో దేవాలయం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, ఆలయ మేనేజర్ ఎస్‌వీడీ ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు సౌమిత్రి రామాచార్యులు, రైతు సమితి మండల కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు, ప్రముఖ వైద్యులు డాక్టర్ సోమలింగారెడ్డి, సొసైటీ చైర్మన్ లక్ష్మణరావు, భూపాల్‌రెడ్డి, పసుమర్తి రాంబాబు, ఎండీ ఇస్మాయిల్, వెంకటేశ్వరరావు, తిరమలరావు, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి మురళీ సేవలు చిరస్మరణీయం..

సత్తుపల్లి: సత్తుపల్లి మాజీ సర్పంచ్ కోటగిరి మురళీకృష్ణారావు చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఆదివారం కోటగిరి మురళీకృష్ణారావు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, దామెర రమేష్, కోటగిరి ఆనంద గజపతిరావు, కోటగిరి వెంకట్రావ్, అమరవరపు కృష్ణారావు, కృష్ణయ్య, రఫీ పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ ప్రతిష్ఠ వేడుకలు



హోమం నిర్వహిస్తున్న నోస్ట్ ల్యాబ్ ఎండీ డాక్టర్ సత్యనారాయణరెడ్డి దంపతులు

వేంసూరు: మండలంలోని ఎర్రగుంట పాడులో నూతనంగా నిర్మించిన రామాలయం ప్రతిష్ఠ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని తీరొక్క పూలతో సుందరంగా అలంకరించారు. శ్రీ సీతారామ, లక్ష్మణ ఆంజనేయ జయ విజయ గణపతి, శిఖర జీవధ్వజ, గ్రామ శీతల పరమేశ్వరి, ముత్యాలమ్మ, పోతురాజు, నూతన యంత్రమూర్తి ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలాన్యాసహోమం, ఆలయ బలిహరణలు, గోజ్వాలా దర్శనము, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, శాంతి కల్యాంణం, పండిత ఆశ్వీర్వచనం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ హోమం కార్యక్రమంలో నోస్ట్ ల్యాబ్ ఎండీ డాక్టర్ భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి దంపతులతో పాటు స్థానిక ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, స్థానిక భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా సీతారాముల కల్యాణ మహోత్సవం



దాసాంజనేయ స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి తదితరులు

వైరా/ఏన్కూరు: వైరా రిజర్వాయర్ సమీపంలో శ్రీ దాసాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ వేడుకకు ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ మహోత్సం నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. పూజలు అనంతరం ఏన్కూరు మండలంలో పర్యటించి పలు శుభకార్యాలకు హాజరైనారు. హిమామ్‌నగర్‌లో జరిగిన భూక్య వినోద్‌కుమార్ కూతురు, రేపల్లెవాడలో నిమ్మల నాగేశ్వరరావు కూతురు అన్నప్రాసన వేడుకలకు పొంగులేటి, రాములునాయక్ హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, బాణోత్ విజయబాయి, బీజేపీ నాయకులు బీపీ నాయక్, ఆలయ కమిటీ సభ్యులు చింతనిప్పు వెంకటయ్య, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జానికీపురంలో ఆలయ ప్రతిష్ఠ

పెనుబల్లి: మండలంలోని జానికీపురంలో శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ ఆదివారం వేద పండితుల మంత్రోర్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ధ్వజస్తంభం ఎత్తి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఖమ్మం మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు వేరు వేరుగా హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం పొంగులేటి రూ. 25 వేలు విరాళం అందించారు. పొంగిలేటి వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, భద్రారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించాలి

వైరా: వైరా రిజర్వాయర్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చి ప్రతి రోజూ తాగు నీరందించడానికి కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ బృందం వైరా రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైరా రిజర్వాయర్‌లో సరపడా నీరు లేనందున వైరా మండలంలోని పలు గ్రామాల ప్రజలకు తాగునీటిని గత పది రోజులుగా నిలిపి వేశారన్నారు. సాగర్ జలాలతో వైరా రిజర్వాయర్‌ను పూర్తి స్థాయిలో నింపి తాగు నీటికి సమస్య ఏర్పడకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సుధాకర్, నరసింహారావు, సీతారాములు, మధు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


దోపిడీ చేయొద్దు..

ఎర్రుపాలెం: విద్యుత్ వినియోగదారుల నుంచి ఏసీడీల పేరుతో విద్యుత్ శాఖ అదనపు దోపిడీకి పాల్పడటం సరికాదని సీపీఎం మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య కోరారు. ఆదివారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు 24 గంటల పాటు విద్యుత్ ఇస్తున్నామని ప్రభుత్వం రైతాంగాన్ని, ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు కోటేశ్వరరావు, జోగయ్య, హనుమంతరావు, సురేష్, నాగుల్‌మీరా, వీరాంజనేయులు, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ మండల కార్యదర్శిగా నవీన్

ఏన్కూరు: ఏన్కూరులో ఆదివారం బీజేపీ మండల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్‌ను మండల కార్యదర్శిగా మండలాధ్యక్షుడు నల్లమోతుల రమేష్ ఎన్నిక చేశారు. అనంతరం నవీన్ మాట్లాడుతూ.. బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నారాయణ, రాందాస్, వెంకన్న, బిక్షం, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తల్లాడ: 1978-79 పూర్వ విద్యార్థులు



కారేపల్లిలో..

తల్లాడ: తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కారేపల్లి హైస్కూల్‌లో పూర్వ విద్యార్థి పిల్లి వెంకటేశ్వర్లు, పాలిక సారయ్యల ఆధ్వర్యంలో పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. దీంతో వారు ఒకరునొకరు ఆత్మీయంగా పలకరించుకొని వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కారేపల్లిలో అప్పటి ఉపాధ్యాయులైన జగన్మోహన్‌రావు, పారుపల్లి సురేష్, సత్యనారాయణ, రమణ, రామకృష్ణాచార్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాలలో సరదాగా నృత్యాలు చూస్తూ ఆనందంగా గడిపారు. ఆయా కార్యక్రమాలలో పూర్వ విద్యార్థులు పిల్లి వెంకటేశ్వర్లు, సారయ్య, సికిందర్‌బాబా, శైలజ, ప్రమీల, ఇంద్రాణి, హరి, శంకర్, ఉమామహేశ్వరరావు, రత్నం, యాకూబ్, కడారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.